ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

****

నల్లగొండ

5

శుక్రవారం 2 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 24.4

● వాడవాడలా మేడే



జిల్లా వ్యాప్తంగా కార్మికుల దినోత్సవం మేడేను గురువారం వేడుకగా నిర్వహించారు. పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు వాడవాడలా పతాకాలను ఆవిష్కరించి మేడే ప్రాముఖ్యాన్ని వివరించారు.

● 8లో..

నల్లగొండలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజల్లో పాకిస్తాన్‌తో తేల్చుకోవాలనే అభిప్రాయం

- కేసీఆర్ కాంగ్రెస్‌ను విలన్ అనడం అర్థరహితం
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్తాన్‌తో తాడోపేడో తేల్చుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో కనిపిస్తోందని, అయితే యుద్ధం కంటే ఉగ్రవాదాన్ని సమూలంగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ భూభాగంలో ఉన్న ఉగ్రవాదులను వారి నాయకులను వెంటనే అప్పగించాలన్నారు. జనగణనలోనే కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల్లో సామాజిక నేపథ్యాల కారణంగా కులాల రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, ఈ అంతరాన్ని ఎలా తొలగిస్తారో చెప్పాలన్నారు. 2014 పునర్విభజన చట్టంలో నియోజకవర్గాల పునర్విభజన అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ తరువాత జమ్ముకాశ్మీర్‌లో చేశారన్నారు. విభజన చట్టం ప్రకారం అవకాశం ఉన్న తెలంగాణ, ఏపీలలో ఇప్పటి వరకు చేయలేదన్నారు. తెలుగు రాష్ట్రాలపై కేంద్రం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, చాలా సందర్భాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుందని, ఫొటో వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. టన్నెల్ ప్రమాదం వల్ల కొంత ఆలస్యమైనప్పటికీ త్వరలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని మాజీ సీఎం కేసీఆర్ అనడం అర్థరహితమన్నారు. తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు కేసీఆర్ స్వయంగా అనేక సార్లు తనతో చెప్పారని, సోనియా గాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని స్వయంగా కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ పోరాటాన్ని కూడా కాదనలేమని, అందుకే ప్రజలు పదేళ్లు అధికారం ఇచ్చారన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో కేసీఆర్, సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ పాత్ర కాదనలేమన్నారు.

ఎల్కతుర్తి సభ సక్సెస్‌తో కాంగ్రెస్ పార్టీలో వణుకు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో వణుకు పుట్టి అక్కసు వెళ్లగక్కుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పరిపాలనా అనుభవం లేని కొత్త బిచ్చగాళ్లను కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ ఏడాదిన్నర సమయం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెంది ప్రజల్లో కొత్త సమస్యలు సృష్టిస్తోందని విమర్శించారు. దేశ చరిత్రలో ఏ శాసనసభలో ఇలా వ్యవహరించలేదని, అసెంబ్లీలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సభలో నిబంధనలు గాలికి వదిలి బూతులు మాట్లాడిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. పదేళ్లలో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజల్లో చర్చకు పెడుదామని, దమ్ముంటే మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ముందుకు రావాలన్నారు. తెలంగాణను ఏడారి చేసి ఫ్లోరైడ్ మహమ్మారిని పెంచి పోషించి, సూర్యాపేటకు మూసీ నీళ్లు తాగించింది మీరు కాదా అని ప్రశ్నించారు. తమ హయాంలో 3.5లక్షల నుంచి 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని పెంచామని, ఆరు ఏళ్లలో ఫ్లోరైడ్ పీడను తొలగించామన్నారు. మూడు జిల్లాలను చేసి మూడు మెడికల్ కళాశాలలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్



దేవరకొండలోని ఓ ఆస్పత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

దేవరకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలని, అందుకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం దేవరకొండ పట్టణంలోని బాల విజయసాయి, జ్యోతి ఆస్పత్రి, వినాయకతో పాటు పలు డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను ఆయన తనిఖీలు చేశారు. ప్రతీ ఆస్పత్రిలో విధిగా ఫీజుల వివరాలు ప్రదర్శించాలన్నారు. ల్యాబ్‌లలో టెక్నీషియన్ సర్టిఫికెట్ కనిపించేలా ఉంచాలని సూచించారు. అనంతరం డాక్టర్ల అర్హత వివరాలు తెలుసుకొని, స్కానింగ్ సెంటర్లలో విధిగా రెడియాలజిస్టు ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ అరుంధతి, నర్సయ్య, హరిలాల్, విజయప్రసాద్, కలీం ఉన్నారు.

ముషంపల్లి రోడ్డుకు మహర్దశ



ఏఆర్‌నగర్ నుంచి గుట్టకింది అన్నారం వరకు పూర్తయిన డబుల్‌రోడ్

- రూ.100కోట్లతో కొనసాగుతున్న విస్తరణ పనులు
- మంత్రిగా కోమటిరెడ్డి తొలి సంతకం చేసిన పని
- నల్లగొండ-నాగార్జునసాగర్ నియోజక వర్గాలకు అనుసంధానమయ్యే రహదారి
- అత్యధికంగా 37 చోట్ల కల్వర్టుల నిర్మాణాలు
- నల్లగొండ-ముషంపల్లి-కన్నెకల్ మార్గంలో దారి పొడువునా విద్యుత్ లైన్ల షిఫ్టింగ్
- వీటివల్లే పనుల్లో జాప్యం
- మూడు కిలోమీటర్ల మేర పూర్తయిన బీటీరోడ్డు
- తొమ్మిది చోట్ల కాల్వలపై వంతెనలూ నిర్మించాల్సిందే

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ-ముషంపల్లి-ధర్మాపురం-కన్నెకల్ రోడ్డు విస్తరణ పనులు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో కొనసాగుతున్నాయి. ఈ రహదారిని 65 ఫీట్ల బీటీ రోడ్డుగా విస్తరిస్తున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి నిమిషంలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ రహదారికి నిధులు మంజూరు చేస్తూ సంతకం చేయడంతో ఈ పనులకు ప్రాధాన్యం పెరిగింది.

ముషంపల్లి రహదారి ఎత్తు పెంచడంతో పాటు, పాత రోడ్డును మూడురెట్లు వెడల్పు చేస్తున్నారు. ఈ రహదారి పొడవునా సమాంతరంగా విద్యుత్ లైన్లు, సాగు నీటిపారుదలశాఖకు చెందిన వంతెనలు ఉండడంతో ఆయా శాఖల సమన్వయంతో ఈ రహదారిని విస్తరిస్తున్నారు. అదేవిధంగా రహదారికి ఇరువైపులా బత్తాయి తోటలు, వ్యవసాయ పొలాలు ఉండడంతో పెద్దసంఖ్యలో కల్వర్టులున్నాయి. వీటన్నింటినీ పునర్నిర్మించారు. నల్లగొండ పట్టణ శివార్లలో సుమారు కిలోమీటర్ మేర భూగర్భ మురుగునీటి కాల్వ నిర్మిస్తుండడంతో ఆ పనులు పూర్తయ్యాకే ఈ రహదారుల పనులు పూర్తిచేయాల్సి ఉంది. దీంతో యూజీడీ పనులను సైతం వేగవంతం చేశారు. మంత్రి తొలిసంతకం చేసిన పని కావడంతో, పనులను స్వయంగా మంత్రి పర్యవేక్షిస్తుండడంతో అధికారులు పనుల నాణ్యత, వేగంగా పూర్తిచేయడంపై దృష్టిసారించారు.

● నల్లగొండ-కన్నెకల్ మార్గంలో రోడ్డు విస్తరణలో తొమ్మిది చోట్ల కెనాల్ బ్రిడ్జీలున్నాయి. ఈ బ్రిడ్జీలను ఇరిగేషన్‌శాఖ పునర్నిర్మించాల్సి ఉండడంతో అక్కడ పాత బ్రిడ్జీలనే ప్రస్తుతానికి కొనసాగిస్తున్నారు. ఈ బ్రిడ్జీలు ఇరుకుగా ఉండడంతో పాటు కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ పెరుగుతుందని, దీంతో ఈ వంతెనలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జీలను సైతం రోడ్డు విస్తరణకు అనుగుణంగా నూతనంగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వీటిపై ఇంతవరకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయలేదని,

మిగతా 8వ పేజీలో...

● మూడు కిలోమీటర్ల మేర పూర్తయిన రహదారి

నల్లగొండ-కన్నెకల్ మధ్య బీటీ రోడ్డు ఎత్తు పెంపు, 65 ఫీట్ల వెడల్పుకు అనుగుణంగా అవసరమైన ఫార్మేషన్ పనులు పూర్తయ్యాయి. ఈ మొత్తం రహదారికి ఇరువైపులా బత్తాయితోటలు, వ్యవసాయ పొలాలు ఉండడంతో గతంలో అక్కడున్న జాలు కాల్వలు, వరదనీటి కాల్వలకు ఆటంకాలు లేకుండా ఏర్పాటైన 37 కల్వర్టులను పునర్నిర్మించారు. రోడ్డు పూర్తయ్యాక వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా రోడ్డుకు ఇరువైపులా ట్రెంచ్‌లను తవ్వే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రెండుచోట్ల చెరువుకట్టలు ఉండగా, అక్కడ విస్తరణ చేసేందుకు అవసరమైన ఫార్మేషన్ పనులు పూర్తిచేశారు. అన్ని పనులు పూర్తిచేసి ముషంపల్లి సమీపంలో రెండు కిలోమీటర్లు, గుంటుపల్లి వద్ద ఒక కిలోమీటర్‌మేర బీటీరోడ్డు నిర్మాణం పూర్తయింది. అదేవిధంగా మిగిలిన చోట్ల బీటీ వేసే పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

కూలీలకు అధిక వేతనం వచ్చేలా పనులు కల్పించాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ జి.సృజన



చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద నర్సరీని పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన

చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు అధిక వేతనం వచ్చేలా పనులను కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి శివారులో ఉపాధి హామీ పనులను, నర్సరీని కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. పనులకు ఏ సమయంలో వస్తున్నారు? ఎన్ని గంటలు చేస్తున్నారు? వేతనానికి తగిన పనిని కల్పిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన వేతనం వస్తోందని కూలీలు వివరించారు. ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతూ గుట్ట దగ్గర పనిని ఎలా గుర్తించారని, నిర్ధారించిన వేతనం రూ.307 ఎలా వస్తోందని అడిగారు. వాలు ప్రాంతాన్ని చేసుకుని కందకం పని చేయిస్తామని, వర్షం వస్తే నీరంతా దిగువకు జారి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నీరు ఇంకేలా పనులు చేయిస్తున్నామన్నారు. కొలతల ప్రకారం రోజుకు కూలి రూ.307 వస్తోందని వివరించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల లక్ష్యం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూలీలు పనులకు త్వరగా వస్తే ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.307 వస్తుందన్నారు. గుట్ట ప్రాంతాల్లో వేసవితో జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలన్నారు. ఇళ్లల్లో పెంచుకునేలా పెరటి మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీవో వెంకటయ్య, పీఆర్ ఈఈ గిరిధర్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో జయలక్ష్మి, ఏపీవో శ్రీలత, తదితరులు ఉన్నారు. కాగా, కుడిచేతి నొప్పి కారణంగా కట్టుతోనే కలెక్టర్ త్రిపాఠి హాజరయ్యారు.

అదేవిధంగా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల, యడవెల్లి, నార్కట్‌పల్లి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్, ఫాంపాండ్ పంచాయతీరాజ్ కమిషనర్ సృజన పరిశీలించారు. ఆమె వెంట జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవో ఉమేష్, ఎంపీవో సుధాకర్, ఏపీవో యాదయ్య, తదితరులు ఉన్నారు.

ధాన్యం దిగుమతుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



మిర్యాలగూడలో అధికారులను వివరాలు అడిగితెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తక్షణమే దిగుమతి చేసుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని అవంతీపురం మార్కెట్‌యార్డులోని ఐకేపీ కేంద్రంతోపాటు సూర్యతేజ రైస్‌మిల్లు, పలు రైస్ మిల్లులను ఆమె తనిఖీచేసి మాట్లాడారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, సివిల్ సప్లయ్స్ అధికారులు, మార్కెట్ సూపర్‌వైజర్ అరుణ్, సీఈవోలు లచ్చయ్య, యాదగిరి ఉన్నారు.

తాలు పేరుతో కోత పెడుతున్నారు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్): తాలు పేరుతో మిల్లర్లు ధాన్యంలో కోత పెడుతున్నారని రైతులు కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీచేశారు. నాణ్యత ఉన్నవి, నాణ్యత లేనివి చూడకుండా అన్నింటికీ ఒకేలా కోత పెడతామంటున్నారని, అలాగైతేనే దిగుమతి చేసుకుంటామంటున్నారని రైతు నర్సిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ధాన్యం ఎగుమతికి లారీలు సరిగా రావడం లేదని పీఏసీఎస్ చైర్మన్ రేగట్టె నారాయణరెడ్డితో పాటు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీఎస్‌వో హరీష్, డీసీవో పాత్యానాయక్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, కేంద్రం పర్యవేక్షణాధికారి రేణుక, డీటీ రామకృష్ణ, ఆర్ఐ తరుణ్, ఏఈవో విజయలక్ష్మి, పీఏసీఎస్ సీఈవో చిక్కుళ్ల వెంకన్న, తదితరులు ఉన్నారు. అదేవిధంగా చిట్యాల మండలం వట్టిమర్తిలోని ఉదయ్ ఇండస్ట్రీస్ కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలన్నారు. దిగుమతుల్లో జాప్యం లేకుండా హమాలీల సంఖ్య పెంచాలని సూచించారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు పటిష్ట భద్రత

- ఐజీ సత్యనారాయణ ● నాగార్జునసాగర్‌లో ఏర్పాట్ల పరిశీలన



సాగర్ బుద్ధవనంలో ఏర్పాట్లపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో చర్చిస్తున్న ఐజీ సత్యనారాయణ

● 7లో..

విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు



ఏరియా ఆస్పత్రిలో వైద్యుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి అవుట్ పేషంట్ వార్డుల్లో రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రోగులు మాట్లాడుతూ వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావడం లేదని, గంటల తరబడి ఆస్పత్రి విభాగాల వద్ద వేచిచూడాల్సి వస్తోందని రోగులు వాపోయారు. అనంతరం ఇన్‌పేషంట్ వార్డును తనిఖీ చేసి అవుట్ పేషంట్, ఇన్‌పేషంట్ వార్డుల్లో రోగుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాల్లో విధుల్లో ఉండాల్సిన వైద్యుల గురించి ఆరాతీయగా పలువురు గైర్హాజరు అవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 11గంటల వరకు ఓపీ వార్డుకు రాని వైద్యుల వివరాలపై ఆరా తీశారు. ఓపీ, ఐపీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయా వార్డుల్లో వైద్యసేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. చికిత్స విషయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రోగులు ఆవేద వ్యక్తం చేశారు. దీంతో వైద్యుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సర్జన్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో గుర్తించిన లోపాలు, వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీపై కేసు నమోదు

మోటకొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేందర్ యాదవ్ తెలిపారు. కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్ 2019 నుంచి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4.45గంటల సమయంలో కంపెనీలోని 18-ఏ భవనంలో జరిగిన పేలుడు ధాటికి ఏడుగురు తీవ్రంగా గాయపడగా, కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్(30), మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్(22) శిథిలాలకింద చిక్కుకుని మృతిచెందారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పేలుడు సంభవించిందని సందీప్ తల్లి గునుగుంట్ల మంగమ్మ ఫిర్యాదు మేరకు కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రొడక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద గోవులు తరలిస్తున్న వాహనాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు 14 గోవులను డీసీఎంలో తరలిస్తుండగా పంతంగి టోల్‌గేటు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

శాలిగౌరారం, మే 1 (ఆంధ్రజ్యోతి): పొలంలో మేత మేస్తున్న పశువులు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన కొనపాకుల యాదయ్య రెండు గేదెలు పొలంలో మేత మేస్తుండగా ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మేత కోసం వచ్చిన గేదలు ఆ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.05లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన గనగాని అశోక్‌కు చెందిన ఎద్దు గ్రామ శివారులో మేత మేస్తుండగా అప్పటికే తెగి పడి నేల మీద ఉన్న తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.75 వేల వరకు ఉంటుందని బాధితుడు అశోక్ తెలిపాడు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

పార్ధి గ్యాంగ్‌కు 18 నెలల జైలు శిక్ష

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర దొంగల ముఠా పార్ధి గ్యాంగ్ నిందితులకు కోర్టు 18నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధించిందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. నిందితులు కొన్ని నెలల క్రితం నల్లగొండ జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాలతో పాటు సైబర్ కమిషనరేట్ పరిధిలో, సంగారెడ్డి జిల్లాలో ఎన్‌హెచ్ -65పై వాహనాలను ఆపి నిద్రిస్తున్న వారిపై దాడి చేసి బంగారం డబ్బులు దొంగిలించేవారు. గత ఏడాది మే 18న కట్టంగూరు పీఎస్ పరిధిలో మహారాష్ట్రకు చెందిన నిందితులైన అప్ర పదాంగ, దిల్‌షార్ అశోక్ పవార్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసులు నమోదు చేసి సరైన ఆధారాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ఒకొక్కరికి రూ.1000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల పాటు సాధారణ కారాగార జైళ్లు శిక్ష ఉంటుందని తెలిపారు. పార్ధి గ్యాంగ్ మొత్తం 32 కేసుల్లో నేరాలు అంగీకరించింది. ఈ కేసును త్వరితగతిన ఛేదించి శిక్ష పడేలా కృషిచేసిన నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు, అప్పటి ఎస్‌ఐ సైదాబాబు, చిట్యాల పీఎస్ పోలీస్ ఎస్‌ఐ ప్రస్తుత ఎస్‌ఐ ధర్మా, సీడీవో ముత్తిలింగం, లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్‌లను ఎస్పీ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వలిగొండ, మే 1(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సూర్యాపేట జిల్లా వలిగొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దుప్పల్లి గ్రామ మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు కట్టెల నర్సయ్య, నీల రవి, పలుసం నర్సయ్యపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



యాదగిరి(ఫైల్)

హాలియా, మే 1(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి నల్లగొండ జిల్లా అనుముల మం డలం మదారిగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీ గురువారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన కుందారపు యాదగిరి(48) గురువారం ఉపాధి హామీ పనికి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా వడదెబ్బకు తోడు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మేడే సందర్భంగా హాలియాలో కార్మిక వేడుకల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జడ్జిల బాధ్యతల స్వీకరణ



యాదగిరిగుట్ట కోర్టు న్యాయమూర్తి చండీశ్వరిదేవిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆలేరు, యాదగిరిగుట్ట రూరల్, మిర్యాలగూడ లీగల్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా అజయ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు న్యాయవాదులు జడ్జికి స్వాగతం పలికారు. ఇక్కడ పని చేసిన జడ్జి సూర సుమలత పదోన్నతిపై వెళ్లడంతో ఆమె స్థానంలో భువనగిరి సివిల్ కోర్టు జడ్జి కవిత ఇన్‌చార్జి జడ్జిగా కొంత కాలం పనిచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వనం రాజు, సీనియర్ న్యాయవాదులు జూకంటి రవీందర్, తుంగ హరికృష్ణ, రావుల రజితరెడ్డి, పి రవిందర్, పాషా, రాజశేఖర్, సిద్దులు, శివకుమార్ ఉన్నారు. యాదగిరిగుట్ట న్యాయమూర్తిగా చండీశ్వరిదేవి బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సూదగాని శ్రీహరిగౌడ్, గుడ్ల స్వామి, న్యాయవాదులు ఎం. రాజిరెడ్డి, పెంట రమేష్, ఐరేని కృష్ణ, దండెబోయిన గణేష్‌యాదవ్, బి. రేణుక, వినీత, కనకరాజు, డప్పు వీరస్వామి, గొట్టిపాములు సాయికృష్ణ పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ జూనియర్ సివిల్ జడ్జిగా పి.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి జి.వేణు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, కార్యదర్శి ఎ.రాజ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు గౌరు వెంకటేశ్వర్లు, సీహెచ్.రాఘురామరావు, జిన్నె శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, మంద సైదులు, కుమార్‌రెడ్డి, గంగాభవాని, నాగేందర్, ఇస్మా, పూసపాటి పరమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మోటకొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం సంభవించిన భారీ పేలుడు దాటికి మరణించిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షలు, గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు మాజీ సహాయ ప్రభుత్వ న్యాయవాది గొరిగే మల్లేష్ డిమాండ్ చేశారు. కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిసరాలను, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంట గొరిగే అయిలయ్య, జెన్ని రఘు, గొరిగే పెద్ద మల్లేష్ ఉన్నారు.

హుజూర్‌నగర్ నుంచి అనలాగ్ మిషన్ వరకు

● అనలాగ్ వ్యోమగామి శిక్షణకు యువ శాస్త్రవేత్త మోహన్‌సాయి ● అమెరికా అరిజోనాలో మే 5 నుంచి 9 వరకు శిక్షణ ● ప్రపంచవ్యాప్తంగా 18 మంది శాస్త్రవేత్తలకు అవకాశం



అన్‌లాగ్ మిషన్‌కు ఎంపికైన యువశాస్త్రవేత్త మోహన్‌సాయి

హుజూర్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యువ శాస్త్రవేత్త ఆకుల మోహన్‌సాయికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని అరిజోనాలో మే 5 నుంచి 9వ తేదీ వరకు ప్రపంచంలోని అతిపెద్ద అనలాగ్ వ్యోమగామి శిక్షణకు ఎంపికయ్యారు. బయోస్పియర్-2 అనే అనలాగ్ స్థావరంలో జరిగే ఈ శిక్షణకు ప్రపంచ నలుమూలల నుంచి 18మంది యువ శాస్త్రవేత్తలకు అవకాశం దక్కింది. భారతదేశం నుంచి ఇద్దరికి అవకాశం రాగా అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి మోహన్‌సాయి ఒకరు. ఈ శిక్షణ మార్స్ లాంటి ఉపరితలం లాంటి పరిస్థితుల్లో జీవించడం, పనిచేయడం, అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది.

ప్రస్తుతం మోహన్‌సాయి ముంబాయిలోని అమిటీ యూనివర్సిటీలో ఆస్ట్రో బయాలజీ అండ్ స్పేస్ సైన్స్ 2023-25 కోర్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక విద్యార్థిగా విద్యనభ్యసిస్తున్నారు. మాస్టర్స్ థీసిస్-లూనార్ సోయిల్ సిమ్యులెంట్ (ఎల్ఎస్ఎస్)పై పంటలు పెంచడంపై ప్రయోగాత్మక పరిశోధన చేస్తూ భారత భవిష్యత్ చంద్రయాన స్థిర నివాసాల కోసం ప్రయత్నిస్తున్నారు. రెండేళ్లుగా హైదరాబాద్, బెంగళూరు, పూనే వంటి నగరాల్లో నాలుగు వేల మంది విద్యార్థులకుపైగా శాస్త్ర విజ్ఞానాన్ని చేరువ చేస్తూ స్పేస్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు.

వర్చువల్ ట్రైనింగ్ పూర్తి చేసి..

2004 ఫిబ్రవరిలో ప్రపంచ స్థాయి వరల్డ్ బిగ్గెస్ట్ అనలాగ్ మిషన్‌కు 2200 మందికి పైగా దరఖాస్తు చేశారు. 18 మందిని ఎంపిక చేయగా అందులో సాయి ఒకరు. సహచరుల సమీక్షలతో కూడిన మాడ్యుళ్ళు, సైకలాజికల్, కాగ్నిటివ్ అసెస్‌మెంట్లు, సాంకేతిక ఇంటర్వ్యూలు, సిద్ధాంత పాఠాలు, మిషన్ అనుకరణలు పూర్తిచేసి 2024 నవంబరులో నిర్వహించిన వర్చువల్ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తిచేసి డిసెంబరులో జరిగిన తుదిపరీక్షల్లో 97శాతం స్కోర్ సాధించి 2025 జనవరి 25న ఎంపికయ్యారు.



● 2035 భారత్ అంతరిక్ష స్టేషన్, 2040లో చంద్రుడిపై మొదటి మానవ మిషన్ చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మోహన్‌సాయి తన పరిశోధన, శిక్షణలతో దేశం తరపున ఈ లక్ష్యాలను బలపరుస్తున్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ ప్రయాణాలు, శిక్షణలు, మిషన్ వ్యయాలను భరించిన మోహన్‌సాయి తన శాస్త్రీయ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ముందుకు సాగుతున్నారు. వైజ్ఞానిక పరిశోధన, జీవన పోరాటం, ప్రపంచస్థాయి ప్రతినిధిత్వం-ఇవన్నీ ఆర్థిక అడ్డంకులతో పోరాడుతూ సమతుల్యం చేస్తున్నట్లు మోహన్‌సాయి పేర్కొంటున్నారు. అమెరికా దేశానికి పరిశోధనకు మే 2న వెళుతున్న మోహన్‌సాయి ప్రపంచంలోనే అతిపెద్ద అనలాగ్ వ్యోమగామి మిషన్‌కు వెళుతున్న తరుణంలో క్లిష్టమైన మిషన్‌లో శిక్షణ పూర్తిచేసుకునేందుకు దృష్టి సారించినట్లు మోహన్‌సాయి తన లక్ష్యాన్ని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఉత్తమ పరిశోధన అవార్డు



మోహన్‌సాయి 2023-24 సంవత్సరాల్లో రెండు అంతర్జాతీయ లూనార్ అన్‌లాగ్ మిషన్లు(పోలాండ్, యూరప్) పూర్తిచేశారు. మొదటి మిషన్ తర్వాత ఐఎస్ఆర్ఓ ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఎస్ఎస్ఎస్ 2024లో ఉత్తమ పరిశోధన అవార్డు అందుకున్నారు. ఏప్రిల్ 2024న పోలాండ్‌లోని మిలటరీ ఏరోస్పేస్ ఇనిస్టిట్యూట్‌లో +4.5జీ సెంట్రిఫ్యూజ్ అండ్ జీరో గ్రావిటీ శిక్షణ పొందారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రీయ దౌత్యాన్ని ప్రోత్సహిస్తూ 2024 అక్టోబరులో లూనారెస్ రీసెర్చ్ స్టేషన్(యూరప్) వారు భారత అంతరిక్ష దౌత్య ప్రతినిధిగా మోహన్‌సాయిని ప్రకటించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దర్మాటి దుర్గాప్రసాద్, కాకినాడకు చెందిన పాశిల సత్యనారాయణ, అదే జిల్లాకు చెందిన కామాడి శ్రీనివాస్ 2024 సంవత్సరం అక్టోబరులో నల్లగొండలో రైలులో వచ్చి అలకాపురి కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి రెండు బంగారు చైన్‌లు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే సంవత్సరం డిసెంబరు లో నల్లగొండ పట్టణంలో మహిళా ప్రాంగణం పరిధిలో ఇంటి ఎదుట పార్కు చేసిన పల్సర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ ముగ్గురు దొంగలు గతంలో ఎత్తుకెళ్లిన పల్సర్ బైక్‌పై కాకినాడ నుంచి నల్లగొండకు వచ్చి అక్కలాయిగూడెం ప్రాంతంలో తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించి తాళాలు పగులగొట్టి 12తులాల బంగారం ఆభరణాలు, 50తులాల వెండి, రూ.1.25లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ మూడు నేరాల్లో నిందితుల పోలీసులు నుంచి బంగారు ఆభరణాలు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం దర్మాటి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నారన్నాడు. సత్యనారాయణ, శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బి. డానియెల్‌కుమార్, ఎస్‌ఐ శివకుమార్, సిబ్బంది విష్ణు, సీఐ రాజశేఖర్‌రెడ్డిని, నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌ఐ గోపాల్‌రావును, హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, అంజద్, గాంధీలను డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు.

పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తూ..



దుర్గాప్రసాద్ (ఫైల్)

బీబీనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరై స్నేహితులతో ఆనందంగా గడిపి అనంతరం ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన కూనూరు అమరేందర్‌గౌడ్ ఏకైక కుమారుడు కూనూరు దుర్గాప్రసాద్ (20) ఐఎఫ్‌బీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం కాటేపల్లి గ్రామంలోని ఎక్స్‌ప్లో కంపెనీలో పేలుడు ఘటనలో మృతి చెందిన సందీప్ అంత్యక్రియలో పాల్గొని అదేరోజు సాయంత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు బయలు దేరి వెళ్లాడు. రాత్రంతా స్నేహితులతో ఆనందంగా గడిపి తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై స్వగ్రామం కాటేపల్లికి బయలు దేరాడు. మార్గమధ్యలో బీబీనగర్ బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టడంతో బైకు అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ ప్రమాద సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్ని అంశాలపై అవగాహన కల్పించాలి

● నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థులతో చెస్ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు, విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాకేంద్రంలోని బోయవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. శిక్షణ శిబిరానికి వచ్చిన పిల్లలతో కలెక్టర్ ముచ్చటించారు. ఏ సబ్జెక్టు అంటే ఇష్టమని, ఎలాంటి ఆటలు ఇష్టమని, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి చెస్ ఆడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతోపాటు, అన్ని విషయాల్లో ముందు ఉండాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని నల్లగొండ పట్టణంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, స్కెచ్ పెన్లు, వాటర్ కలర్స్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు నిర్వహించే ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఇండోర్ గేమ్స్, డాన్స్, హస్తకళలు, డ్రాయింగ్, పెయింటింగ్, కెరియర్ గైడెన్స్, నైతిక విలువలు, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాలలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. బిక్షపతి, నాగార్జునసాగర్ బాలకేంద్రం పర్యవేక్షకులు, బాల కేంద్రం ఇన్‌చార్జి బాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ. అంజద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి కోసమే కులగణన

● బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్



మోటకొండూరు మండలం కాటేపల్లిలోని ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ పేలుడులో మృతిచెందిన దేవిచరణ్ తల్లిని ఓదారుస్తున్న మాజీ ఎంపీ బూర

భువనగిరి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం కులగణ చేపడతుందని మాజీ ఎంపీ, ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. భువనగిరిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1931లో దేశంలో బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని తిరిగి బీజేపీ హయాంలో జరుగుతుందన్నారు. దేశంలో ఇప్పటివరకు ఆరు పర్యాయాలు జనాభా లెక్కలు జరగగా దేశాన్ని అధికంగా పాలించిన కాంగ్రెస్ హయాంలో ఐదు పర్యాయాలు జనాభా లెక్కల గణన జరిగిందని, కానీ ఏ ఒక్కసారి ఆ పార్టీ కులగణనను చేపట్టలేదని విమర్శించారు. తెలంగాణలో 53శాతం ఉన్న బీసీలను రాజకీయంగా అణగ తొక్కిందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో 43శాతానికి పరిమితం చేసిందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం మాత్రం దేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టనుందన్నారు. అగ్రవర్ణాల పేదలకు బీజేపీ అమలులోకి తెచ్చిన 10శాతం ఈ బీసీ రిజర్వేషన్లతో ముస్లింలతో సహా హిందూ అగ్రవర్ణాల పేదలు, ఐఏఎస్, ఐపీఎస్ తదితర ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారనేది విస్మరించరాని నిజమన్నారు. మోటకొండూరు మండలం ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ పేలుళ్ల దుర్ఘటనను కేంద్ర మంత్రులు, కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. పరిశ్రమ నిర్వహణ, భద్రతా, కార్మికుల శిక్షణా లోపాలతోనే ప్రమాదం ఆరోపించిందన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ నుంచి రావల్సిన బెనిఫిట్స్‌లను ఇప్పిస్తామని, పరిశ్రమ నిర్వహణ, అనుమతులపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కులగణనపై హర్షిస్తూ ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా, పట్టణ అధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్, రత్నపురం బలరాం, పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, ఎండీ మహ్మద్ నాయకులు మాయ దశరథ, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, పట్నం శ్రీనివాస్, డీఎల్ఎన్ గౌడ్, జి నరసింహచారి పాల్గొన్నారు.

పేలుడు బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు(ఎం), మోటకొండూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు సంఘటనలో మృతిచెందిన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కల్వల నరేష్(32) కుటుంబసభ్యులను భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు అశోక్ గురువారం పరామర్శించారు. నరేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నరేష్ తండ్రి అంజయ్యకు ధైర్యం చెప్పారు. పేలుడు ఘటనలో మృతిచెందిన మోటకొండూరు మండలంలోని గునుగుంట్ల సందీప్, చందోజు దేవిచరణ్ కుటుంబసభ్యులను కూడా పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్, జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు యెల్లంల శ్రీధర్‌రెడ్డి జి. కాశీనాథ్, డి. కుమారస్వామి, బి. అబ్బయ్య, బి. ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కొండమల్లేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి స్థానిక చౌరస్తాలో గురువారం రాత్రి ఇన్‌చార్జి సీఐ రాజుతో కలిసి చేసి బ్రీత్ ఎనలైజర్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై సరైన పత్రాలు, నంబర్ ప్లేటు లేని వాహనాలపై మొత్తం 20మందిపై కేసులు నమోదు చేసినట్టు కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ రాజు తెలిపారు. తనిఖీలో కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్‌ఐ నరసింహులు, రాము, నాగరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు

చిన్నారుల ఆట విడుపు



యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయ్. ఇళ్ల వద్ద ఉంటున్న చిన్నారులు వివిధ ఆటలతో గడుపుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో చిన్నారులు గురువారం క్రికెట్ ఆడి సందడి చేశారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి- యాదాద్రి

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

రామన్నపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 1 నుంచి అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అన్ని వసతులతో పాటు డాక్టరేట్ పొందిన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ఆధారిత విద్యా బోధన అందిస్తామని తెలిపారు. జాతీయ సేవా పథకం రెండు యూనిట్లు, అధునాత గ్రంథాలయ సౌకర్యం ఉందని తెలిఆరు. విశాలమైన ఆట స్థలంతో పాటు ఆధునిక సౌకర్యాలతో కూడి జిమ్ ఉందని, మెరిట్ స్కాలర్‌షిప్‌లతో పాటు, విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ బహుకరిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ధాన్యం కల్లాలు లేక

● రహదారులపై ఆరబోస్తున్న రైతులు
● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఆరుగాలం కష్టపడి పంటను సాగు చేసే రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. పంట పండించడం ఒక్క ఎత్తయితే చేతికి అందిన ధాన్యం విక్రయానికి, అరబెట్టడానికి అవస్థలు పడుతున్నారు. ధాన్యం ఆర బెట్టుకోవడానికి కొనుగోలు కేంద్రంలో స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబోస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)



యాదగిరిగుట్ట మండలం మల్లాపురం రోడ్డుపైన ఆరబోసిన ధాన్యం

ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తేమ 17శాతం ఉంటేనే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. దీంతో రైతులు రైతులు తమ ధాన్యాన్ని తేమ లేకుండా రోజుల తరబడి ఆరబెట్టాల్సి పరిస్థితి నెలకొంది. ఆరబెట్టడానికి సరియైనా ఖాళీ ప్రదేశాలు లేక రైతులు రోడ్లపై లేదా గ్రామాల్లో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ నానా తిప్పలు పడుతున్నారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో గతనెల నుంచి వరికోతలు మొదలైయ్యాయి. ధాన్యం చేతికి రావడంతో తేమ తగ్గించి విక్రయించడానికి ఖాళీ ప్రదేశాలు, కొనుగోలు కేంద్రాలు, గ్రామాల్లో ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. ఆరబెట్టే ప్రాంతానికి ధాన్యం తరలించడానికి అక్కడ నుంచి కొనుగోలు కేంద్రానికి తీసుకరావడానికి రవాణాభారం అధికమవుతోంది. ఒకవేళ ధాన్యం రోడ్డుపై ఆరబోయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒకవేళ వర్షం వస్తే ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనేక ఇబ్బందులు పడుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఇలా..

మండలాలు : 17,
గ్రామ పంచాయతీలు : 248
వరి సాగు : 2.83 లక్షల ఎకరాలు,
రైతులు : 2.81లక్షలు,

ఈజీఎస్ ద్వారా కల్లాల నిర్మాణం అవకాశం


రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంలో వారి ఇబ్బందులను తొలగించడానికి గత ప్రభుత్వం కల్లాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణం చేపట్టారు. రైతులకు సొంతభూమి ఉన్న రైతులకు ఈజీఎస్ ద్వారా ఇవి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అధికారులు రైతులకు సరిగా అవగాహన కల్పించకపోవడంతో పాటుగా బిల్లు రావడం లేదని కల్లాల నిర్మాణానికి రైతులు సుముఖంగా లేకపోవడంతో ముందుకు రాలేదు.. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో 1500 కల్లాలు మంజూరు కాగా కేవలం 390 కల్లాలు మాత్రమే నిర్మించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిధులు నిలిపి వేశారు

గతంలో రైతులు తమ భూముల్లో కల్లాలు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభు త్వం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసేది. దాంతో కొందరు రైతులు కల్లాలు నిర్మించుకున్నారు. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నిలిపి వేయడంతో కల్లాల నిర్మాణం నిలిచిపోయింది.

-నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి భువనగిరి జిల్లా

డబ్బులు ముందే చెల్లించాలి



గతంలో ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి డబ్బులు సరిగ్గా ఇవ్వడపోవడంతో కల్లం నిర్మించుకోలేదు.. సొంత డబ్బులు ఖర్చు పెట్టి కల్లాలు నిర్మించుకొనే స్తోమత లేదు. ప్రస్తుతం ధాన్యం ఆరబోసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి ముందుగానే డబ్బులు చెల్లిస్తే బాగుంటుంది.

-తాళ్ల ఉప్పల్‌రెడ్డి, రైతు

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

● మరో అడుగు పెరిగిన నీటిమట్టం



మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు 25 రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం గత 25 రోజుల్లో 6 అడుగుల మేర పెరిగింది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను వేసిన నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 623.50అడుగులు (0.71టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మూసీ నది పరివాహక ప్రాంత గ్రామాలు, హైదరాబాద్‌లో కురుస్తున్న అకాల వర్షాలు, హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పారుతున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుండటంతో ప్రాజెక్టుకు దాదాపు 380 క్యూసెక్కుల పైచిలుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో పాయింట్ చొప్పున పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఇటీవలి వరకు 630.10అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి మరో అడుగు పెరిగి 631.05 అడుగులు (1.54టీఎంసీలు)గా నమోదైంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 624.20 అడుగులు (0.675టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులుగా ఉంది.

సమాజ చైతన్యానికి రచనలు చేయాలి

● ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న

మిర్యాలగూడ అర్బన్, మే1(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సమాజ చైతన్యాన్ని అవసరమైన రచనలు చేయాలని ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన గోరేటి వెంకన్న పాట, మాటల స్ఫూర్తి సామాజిక సాహిత్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఆర్ట్స్‌కాలేజీ ప్రొఫెసర్ ఖాసీం, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రజా చైతన్యం కోసం కవులు, కళాకారులు, రచయితలు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం కస్తూరి ప్రభాకర్ రచించిన మట్టికాళ్ల ముట్టడి, మధనం, ప్రభాకర చలనం పుస్తకాలను వారు ఆవిష్కరించారు. సాహిత్య సదస్సుకు ముందు చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక, చిత్రకళా ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ప్రముఖ కార్టూనిస్టు నర్సిం, జడ్పీ మాజీచైర్మన్ సీడీ రవికుమార్, మానవహక్కుల వేదిక నాయకులు పి.సుబ్బారావు, నాగవర్ధన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, సాహితీవేత్తలు ఉప్పల పద్మ, సైదులు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాలు, రామలింగయ్య, రవి, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని రోడ్డు పనులు

● కల్వర్టులకే పరిమితమైన డీబీ తండా - కోనాపూర్, ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా పనులు
● శంకుస్థాపన దశలోనే పొట్టిమర్రి తండా - నాగాయపల్లి రోడ్డు
● ఇబ్బంది పడుతున్న ప్రజలు



పొట్టిమర్రితండా -నాగాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు

తుర్కపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించినట్లుగా ఉంది గిరిజన తండాల పరిస్థితి. తండాల్లోకి వెళ్లే అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ఆయా గిరిజన తండాల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా మార్గంలో పంచాయతీ రాజ్ రోడ్డుపై గుంతలు పడి కంకర తేలడంతో ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ గ్రామంలోని జాతీయ రహదారి నుంచి పాత గ్రామ పంచాయతీ వరకు 800 మీటర్ల దూరం సీసీ రోడ్డు వేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 25లక్షలు మంజూరు చేసింది. గ్రామంలో సీసీ రోడ్డు పనులకు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత 2022 మార్చి నాలుగో తేదీన శంకుస్థాపన చేశారు. కానీ సీసీ రోడ్డు పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రానందున నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. తదనంతరం ముల్కలపల్లి జాతీయ రహదారి రోడ్డు నుంచి వయా గంగరాంతండా మీదుగా దేవోజీనాయక్ తండా, గొల్లగూడెం వరకు నాలుగున్నర కిలో మీటర్లు దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.3.37కోట్లను, దయ్యంబండ - కోనాపూర్ మూడు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి షెడ్యూల్డ్ ట్రైబల్ వేల్ఫేర్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి బీఆర్ఎస్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి 2023లో శంకుస్థాపన చేసారు. ఈ రోడ్ల నిర్మాణం పనుల్లో భాగంగా సంబంధత కాంట్రాక్టర్లు ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా మధ్యల కల్వర్టుల నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. దయ్యంబండ - కోనాపూర్ మార్గంలో కల్వర్టు నిర్మాణాన్ని ఆరు నెలల క్రితం పూర్తి చేశారు. పొట్టిమర్రి తండా నుంచి నాగాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబల్ వెల్ఫేర్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) కింద రూ. 1.80కోట్లు మంజూరు చేసింది. ఈ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య 2024 మార్చి 13న శంకుస్థాపన చేశారు. సంవత్సరం దాటినా బీటీ రోడ్డు పనులు మాత్రం ముందుకు కదలలేదు. బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనందున సరైన రోడ్డు మార్గం లేక ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజలు, గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోనందున పూర్తికావడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు.



నిర్మాణం పూర్తయిన కల్వర్టులు

రోడ్డు పనులు పూర్తి చేయించాలి



రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయి రెండేళ్లు పూర్తి కావొస్తుంది. గ్రామానికి వెళ్లే కట్టపై మట్టి కుప్పలు పోసి వదిలేయడంతో రాపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే దుమ్మూధూళి ఇళ్లల్లోకి వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయించాలి.

● సిలివేరు దుర్గయ్య, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి

మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు అధ్వానంగా ఉన్నందున మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపై గుంతలు పడి బురదగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలి.

●పసుపుల కనకరాజు, కోనాపూర్, తుర్కపల్లి

మిస్‌వరల్డ్ పోటీదారులకు పటిష్ట భద్రత

● ఐజీ సత్యనారాయణ ● నాగార్జునసాగర్‌లో ఏర్పాట్ల పరిశీలన



బుద్ధవనాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్రపవార్ తదితరులు

నాగార్జునసాగర్, మే 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పాల్గొనే పోటీదారులు మే 12వ తేదీన సాగర్‌కు రానున్న సందర్భంగా పటిష్ట భద్రతను కల్పించనున్నట్లు ఐజీ సత్యనారాయణ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలో బుద్ధవనం, విజయ విహార్ అతిథి గృహాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ నెల 10 నుంచి 31వ వరకు నిర్వహించనున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే పోటీదారుల్లో ఆసియా దేశాల నుంచి 30 మంది ఈ నెల 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా సాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనాన్ని సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. సాగర్‌కు వచ్చే పోటీదారులకు అసౌకర్యాలు కలగకుండా 1500 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న సాయంత్రం 4:30 నుంచి 7:30 గంటల వరకు మిస్ వరల్డ్ పోటీదారులు సాగర్‌లో ఉంటారని తెలిపారు. ముందుగా విజయవిహార్ అతిథి గృహానికి చేరుకొని కాసేపు సేద తీరిన అనంతరం బుద్ధ పూర్ణిమ ఉత్సవాలల్లో పాల్గొంటారన్నారు. బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం మహాస్తూపం లోపలి వైపున ఉన్న ధ్యాన మందిరంలో కాసేపు ధ్యానం చేస్తారని తెలిపారు. పోటీదారులు హైదరాబాద్ నుంచి సాగర్‌కు చేరుకొని మళ్లీ తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, దేవరకొండ అడిషనల్‌ఎస్పీ మౌనిక పర్యవేక్షణలో భద్రత చర్యలను చేపడతారని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో గ్లోబల్ ఈవెంట్ కాబట్టి ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉందన్నారు. మిస్ వరల్డ్ పోటీల విషయంలో కొందరు నిరసన తెలియజేస్తున్నారు కాబట్టి వారిని ముందుగానే గుర్తించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా నిరసనలు చేపడితే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగర్ పర్యటన విషయంలో ఎలాంటి అంతరాయం జరిగిన మిస్ వరల్డ్ పోటీదారులపై ఎంతో ప్రభావం పడుతుందన్నారు. పోలీసు శాఖ ఈ పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మీడియా కూడా పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సాగర్ సీఐ శ్రీను నాయక్, సాగర్, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్) ఎస్ఐలు సంపత్, వీరబాబు, వీరశేఖర్, సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



తిరువీధి సేవలో ప్రబంధ పారాయణాలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట మే 1 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపలంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వెడూర్యాలుతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది, వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి శేషవస్త్రాలు ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆఆలయంలో నిత్య పూజలు జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు యాగశాలలో నిత్య రుద్రహనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. అయితే వేసవి సెలవులు కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 32,67,774 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.



యాదగిరిగుట్టలో క్యూలైన్లో భక్తులు

వైభవంగా పురపాట్టు సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో గురువారం వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం ఆలయ పూజారులు నిర్వహించారు. జగద్గురు రామానుజాచార్య తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా ప్రబంధ అధ్యాపకులలో కార్యమం నిర్వహించారు. రామానుజచార్య ఆళ్వార్ సేవతో తిరువీధుల్లో ప్రబంధ పారాయణాలు చేపట్టి పురప్పాట్టు సేవ నిర్వహించారు.



యాదగిరిగుట్టలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు



శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు కమిషనర్‌గా పదోన్నతి

రామగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సిహెచ్.నాగరాజుకు మునిసిపల్ కమిషనర్‌గా, అదేవిధంగా దేవరకొండ మునిసిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న కాజా ఆరీఫుద్దీన్‌కు మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ సీడీఎంఏ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వారు ఈ నెల 4వ తేదీలోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

కులగణన నిర్ణయం అభినందనీయం

రామగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. 60 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏనాడు కూడా బలహీన వర్గాల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. అంతేకాక అణగదొక్కే ప్రయత్నం చేసిందని ఆరోపించారు.



హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఎం రమ

హ్యాండ్‌బాల్ శిక్షణ ప్రారంభం

కట్టంగూరు, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సందర్భంగా మండలంలోని చెర్వుఅన్నారంలో గురువారం హ్యాండ్‌బాల్ శిక్షణ కార్యక్రమాన్ని హెచ్ఎం కందాల రమ ప్రారంభించారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు నల్లగొండ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వేసవిలో నిర్వహించే ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి, పీఈటీ చింతకాయల పుల్లయ్య, నగేష్‌లతో పాటు గ్రామస్థులు సుధాకర్, వెంకన్న, సాయి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వాలీబాల్ శిబిరాన్ని ఎస్ఐ శివతేజతో కలిసి ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి

కేతేపల్లి, మే1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతీ యువకులు వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి కోరారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. గురువారం ఆ శిబిరాన్ని ఎస్ఐ ఎ.శివతేజతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతీ యువకులు వేసవిలో అందుబాటులోకి వచ్చిన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని వాలీబాల్‌లో మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. ఆటలు మానసిక, శారీరక కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.రమేష్, మాజీ ఎంపీపీ శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు బంటు రవి, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ బాబా, ఉపాధ్యాయులు కుశలవరెడ్డి, వీరభద్రయ్య, నాగయ్య, సీఆర్పీ కె.మహేందర్, నాయకులు కె.సైదులు, కృష్ణారెడ్డి, సీహెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నూతన కమిటీ



సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న చాంద్‌పాషా

రామగిరి, మే1(ఆంధ్రజ్యోతి): ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ చాంద్ పాషా గురువారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా మహ్మద్ రహీమ్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ రజాక్, కోశాధికారి షేక్ అబ్దుల్ ముకీద్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షకీల్ ఆదేశాల మేరకు జిల్లాలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈవో



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పట్టణంలోని సాగర్ ఎక్స్‌రోడ్డులో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను మర్యాద పూర్వకంగా కలవగా ఆయన వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి విజయాలను సాధిస్తూ వారు చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు సాధించాలని అన్నారు. పదవ తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన దొడ్డి జ్యోష్న 559, కంకనాల పల్లవి 554 మార్కులు సాధించగా 40 శాతం మంది విద్యార్థినీ విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సిహెచ్. యాదయ్య, యాస శ్రీనివాస్ రెడ్డి, గడ్డం త్రిమూర్తి, కె.నాగేశ్వరావు, ప్రిన్సిపాల్ ధనుంజయ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పట్టణ కమిటీ ఎన్నిక

నల్లగొండ, మే 1(ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ నూతన కమిటీని గురువారం నాడు ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడుగా నలపరాజు సైదులు, గౌరవాధ్యక్షులుగా భూతరాజు సైదులు, ఉపాధ్యక్షులు ఐతరాజు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా భూతరాజు శంకర్, కోశాధికారిగా దూదిగామ నాగరాజు, కార్యదర్శిగా కుంచం చందులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలిజాల శంకర్, నాగిళ్ల శంకర్, ఐతరాజు లక్ష్మణ్, భూతరాజు లింగస్వామి, ఎలిజాల సంతోష్, కొండూరు నాగరాజు, ఎలిజాల రాహుల్, వెంకట్, భూతరాజు రాంబాబు, గిరి, ఎలిజాల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థికసాయం



ఆర్థికసహాయం అందజేసి పరామర్శిస్తున్న బాల్యమిత్రులు

చిట్యాలరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): తమతో పాటు విద్యనభ్యసించిన బాల్యమిత్రుడు రోడ్డు ప్రమాదానికి గురైనట్లుగా తెలుసుకుని మనోధైర్యాన్ని కల్పించి గురువారం ఆర్థిక సహాయం అందించారు. చిట్యాల మండలం బోయగుబ్బకు చెందిన చీకూరి అనిల్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది తన నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న చిన్నకాపర్తి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2002-03 10వ తరగతి బ్యాచ్ బాల్యమిత్రులు అనిల్‌కుమార్ నివాసానికి చేరుకుని అతడిని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అందరూ కలిసి సమకూర్చిన రూ.85,500లను అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

వేసవిలో జలకళ



నిండుకుండను తలపిస్తున్న గంగన్నపాలెం చెరువు

- 'మత్తడి' దూకుతున్న గంగన్నపాలెం చెరువు
- ఉదయసముద్రం వద్ద ఫిల్టర్ అవుతున్న నీరు చెరువులోకి
- చెరువు ప్రాంతంలో కనువిందు చేస్తున్న దృశ్యాలు
- భూగర్భజలాలు పెరగడానికి దోహదపడుతున్న చెరువు

నల్లగొండ, మే 1(ఆంధ్రజ్యోతి): నిండు వేసవిలోనూ గంగన్నపాలెం చెరువు మత్తడి దూకుతోంది. అలుగు నుంచి దూకుతున్న నీటి దృశ్యాలు చూపరులకు కనువిందు చేస్తోంది. తిప్పర్తి మండల పరిధిలోని గంగన్నపాలెం చెరువు తీవ్ర వేసవికాలంలోనూ మే నెలలో అలుగులు పోయడం విశేషం. ఈ చెరువుకు నల్లగొండ పట్టణంలోని పానగల్లులో ఉన్న ఉదయసముద్రం వద్ద ఫిల్టర్ అవుతున్న మిషన్ భగీరథ నీరు వృథాగా పోకుండా గంగన్నపాలెం చెరువులోకి చేరడం వల్ల ఎంతో ఉపయోగపడుతుంది. ఈ చెరువులో నీటి వల్ల భూగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామలింగాల గూడెం, రాజుపేట, కాశీవారిగూడెం గ్రామాల పొలాలకు కూడా గంగన్నపాలెం చెరువు నుంచి నీరు అందుతుంది.



నిండు వేసవిలో అలుగుబోస్తున్న గంగన్నపాలెం చెరువు, పక్షుల సందడి

ఫిల్టర్ అయిన నీరు గంగన్నపాలెం చెరువు వైపు...



పానగల్‌లోని ఉదయ సముద్రం వద్ద గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో సుమారు 650 గ్రామాలు సరఫరా అయ్యే మంచినీటి కోసం పానగల్‌లో ఫిల్టర్ బెడ్ల ద్వారా శుద్ధి చేస్తుంటారు. ఈ శుద్ధిచేసిన నీరులో వృథా నీరు ఉదయ సముద్రం ప్రాంతంలో ఉన్న కాల్వలు, డొంకలు, వాగుల ద్వారా తిప్పర్తి మండలం రాజుపేట శివారులోని గంగన్నపాలెం చెరువులోని నిరంతరం నీరు పారుతూ ఉంటుంది. ఈ చెరువులో సంవత్సరం మొత్తం 365 రోజులు చెరువు నిండా నీరు ఉండటం, నిండిన తర్వాత మత్తడి దూకడం నిరంతరం జరుగుతుంది. అదేవిధంగా ఈ చెరువులో చేపలు కూడా పెంపకం చేస్తున్నారు. దీంతో కూడా కొంతమందికి ఉపాధి లభిస్తుంది. ఇక వానాకాలం పంటతో పాటు యాసంగి సీజన్‌లలో ఈ చెరువు నుండి నీటిని తమ పంట పొలాలకు రైతులు ఉపయోగించుకొని లబ్ధి పొందుతున్నారు. గంగన్నపాలెం చెరువు మండుటెండల్లో కూడా కృష్ణా జలాల మాదిరిగా పారుతూ ఉండటం విశేషం. పానగల్లు చెరువు నుండి వచ్చే ప్రతి చుక్కనీరు గంగన్నపాలెం చెరువుకు పారడం విశేషం. నిత్యం చెరువు అలుగు పోయడం కనిపిస్తుంది.

గంగన్నపాలెం చెరువు వద్ద పక్షుల సందడి

చెరువులో నీరు పుష్కలంగా ఉండటంతో ఎండ వేడిమి తట్టుకోలేక గేదెలు, పశువులు ఆ నీటిలో సేదతీరడంతో పాటు తమ దాహాన్ని తీర్చుకుంటున్నాయి. ఈ చెరువు వద్ద పిచ్చుకలు, పక్షులకు దాహం తీర్చుకోవడానికి క్రిమికీటకాలు, చిన్నపాటి చేపలు పక్షులకు ఆహారంగా మారి ఆకలి తీర్చుతున్నాయి. పక్షులకు ఇది ఆవాసంగా మారిందని చెప్పవచ్చు. అనేక వలస పక్షులు ఈ చెరువు వద్దకు రావడం విశేషం. చెరువుల వద్ద పిచ్చుకలతో పాటు బాతులు కనిపిస్తున్నాయి. చెరువులో పుష్కలంగా నీరు ఉండటంతో పక్షులు, పిచ్చుకలు, పశువులకు గంగన్నపాలెం చెరువు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ చెరువు వద్దకు వలస పక్షులు వస్తుండటంతో ఆ ప్రాంతమంతా కోకిల రాగాలు, పిచ్చుకల సందడి, పక్షుల రాకతో ఆ ప్రాంతమంతా ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. దీంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వారు కూడా గంగన్నపాలెం చెరువు చూడటానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

మే డే స్ఫూర్తిని కొనసాగించాలి

- వివిధ పార్టీల నాయకులు
- జిల్లాలో ఘనంగా మేడే వేడుకలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మేడే స్ఫూర్తిని కొనసాగించాలని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా జిల్లాలోని వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చికాగో నగరంలో చిందిన రక్తం ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు నాంది పలికిందని అనేక కార్మిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. కార్మికులు ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేస్తూ, పని గంటలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పన్నెండు గంటలుగా మార్చడానికి కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని అన్నారు. నేడు దేశంలో అసంఘటితరంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి కనీసం పని భద్రత, ఎలాంటి సౌకర్యాలు లేవని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతునందున కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చికాగో అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ మేడే స్ఫూర్తితో కేంద్ర ప్ర భుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ విధానాల వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు.

● సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, నాయకులు వీరస్వామి, నరసింహ, రమేష్, లెనిన్, ముత్యాలు, యాదగిరి, మదర్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద మునిసిపల్ వర్కర్స్ యూనియన్, డీఎంహెచ్‌వో కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, డీఈవో కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మేడే ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, నాయకులు పెరిక కల్యాణ్, ఎర్ర శ్రీనివాస్, నాంపల్లి శ్రీను, యాదమ్మ, పూలమ్మ, పబ్లిక్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బిక్షం, నరసింహచారి, వెంకట్‌రెడ్డి, మామిడి కార్తీక్, నాగరాజు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న మోహన్‌రెడ్డి



క్లాక్‌టవర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

● సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో పార్టీ జిల్లా తుమ్మల వీరారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డితో కలిసి జెండాను ఆవిష్కరించారు. నాయకులు నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, లక్ష్మీనారాయణ, హాశం, ప్రభావతి, పుచ్చకాయల నర్సిరెడ్డి, సలీం, సత్తయ్య, పద్మ పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లో హమాలీ సంఘం, గడియారం సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, నాయకులు యాదయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకన్న, కృష్ణయ్య, ఆచారి, వెంకన్న పాల్గొన్నారు.

● కనగల్ మండలంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ప్రభావతి, లింగస్వామి, సుల్తానా, లింగయ్య, వెంకటయ్య, రాములు, మంజుల, దీనారాణి, నర్సింహ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పెంజర్ల సైదులు, కట్ట బక్కయ్య, రామస్వామి, రామకృష్ణ, పొడిచేటి లింగయ్య, లింగస్వామి, రవి, వెంకన్న పాల్గొన్నారు.



సీపీఎం కార్యాలయంలో జెండాను ఎగరవేస్తున్న సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి

● శాలిగౌరారం సీపీఎం, సీపీఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్ కార్మిక విభాగం, హమాలీ సంఘాల, మనిమద్దె గ్రామంలో ట్రాక్టర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఉత్సవాలు నిర్వహించారు.

● నార్కట్‌పల్లి కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవణ్‌కుమార్, నాయకులు అనంతరెడ్డి, పెంద్యాల శంకర్, వంగాల నాగయ్య, శ్రీనివాస్, వెంకన్న, నర్సింహ, స్వామి, మల్లేష్, బయ్యన్న, రవి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి, నాంపల్లి, మునుగోడు, చిట్యాల మండలాల్లో పలు పార్టీలు, అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు బి.చినవెంకులు, సీహెచ్.లూర్దుమారయ్య, కె.శ్రీనివాసయాదవ్, బడుగుల నరేందర్, ఎ.సుధీర్, వి.వెంకన్న, పి.మల్లయ్య, సైదులు, వెంకన్న, నాంపల్లి చంద్రమౌళి, మల్లింగం, లక్ష్మయ్య, రాములు, గోవిందరాజు, రామచంద్రం వెంకటేశ్వర్లు, వెంకన్న, శివయ్య, కైలాస్, ముత్తయ్య పాల్గొన్నారు.



కేతేపల్లి: కొండకిందిగూడెంలో జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు

ముషంపల్లి రోడ్డుకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

తక్షణమే వీటి పునర్నిర్మాణంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.



వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

వేగవంతంగా పనులు పూర్తిచేయాలి

ముషంపల్లి రహదారి పనులు ప్రారంభించి 15 నెలలు గడిచింది. విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పిడి, కల్వర్టుల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. అయితే మంత్రి సంతకం చేసిన తొలి పని కావడంతో దీన్ని జాప్యం లేకుండా పనులు కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. నల్లగొండ, నాగార్జునసాగర్ ని యోజకవర్గాలతో జిల్లా కేంద్రానికి అనుసంధానమయ్యే ఈ రోడ్డు ఎంతగానో ప్రయోజకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్న స్థానికులు రోడ్డు పనులు మందగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో పనుల్లో వేగం తగ్గిందని, తక్షణమే పనులు వేగం పుంజుకునేలా మంత్రి చర్యలు తీసుకోవాలని స్థానికులు చెబుతున్నారు. బీటీ వేసే పనే ప్రస్తుతం మిగిలి ఉందని, వేసవి ముగిసేలోగా ఈ పని పూర్తిచేయించాలని కోరుతున్నారు. అదేవిధంగా కాల్వ ల వంతెనలను కూడా పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ పనులు కూడా చేపట్టాలని కోరుతున్నారు.

పనులు వేగంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటాం

ముషంపల్లి రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దాదాపు మూడు కిలోమీటర్ల మేర బీటీ పూర్తయింది. రోడ్డు విస్తరణ కావడంతో కల్వర్టులు, విద్యుత్ లైన్ షిఫ్టింగ్, మట్టిరోడ్డు నిర్మాణం ముందస్తుగా చేపట్టాం. ఆ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. బీటీ పనుల్లో కూడా వేగం పెంచుతాం. కాల్వలపై ఉన్న బ్రిడ్జీలను ఇరిగేషన్ శాఖనే పునర్నిర్మించాల్సి ఉంది. అది ఆర్అండ్‌బీ పరిధిలోకి రాదు. వీలైనంత వేగంగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

\- యాకుబ్, ఆర్అండ్‌బీ డీఈ నల్లగొండ



నిర్మాణంలో ఉన్న కల్వర్టు

5 శాతం రాయితీకి
వారం రోజులు గడువు పొడిగింపు

రామగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ అవకాశం ఈ నెల 7వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గాంధీజీ' విద్యార్థులకు అభినందన




విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో నాంపల్లి గాంధీజీ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి వరికుప్పల విగ్నేష్ 549/600 మండల మొదటి ర్యాంకు సాధించాడు. మునుగోడులోని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం విగ్నేష్‌ను ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విగ్నేష్ 549 మార్కులతో మండల మొదటి ర్యాంకును సాధించడం గర్వకారణమని అన్నారు. అనంతరం గాంధీజీ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. మండల రెండో ర్యాంకు సాధించిన జాల కావ్య 543, మేకల ధనలక్ష్మి 537, నరెడ్డి వైష్ణవి 535, బెల్లి వర్షిత్ 532, షేక్ తబుసం 531, అమరావరపు వరుణ్‌తేజ్ 526 మార్కులు సాధించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5 | శుక్రవారం 2 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 కనిష్ఠం 24.4

● వాడవాడలా మేడే



జిల్లా వ్యాప్తంగా కార్మికుల దినోత్సవం మేడేను గురువారం వేడుకగా నిర్వహించారు. పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు వాడవాడలా పతాకాలను ఆవిష్కరించి మేడే ప్రాముఖ్యాన్ని వివరించారు.

● 8లో..

నల్లగొండలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజల్లో పాకిస్తాన్‌తో తేల్చుకోవాలనే అభిప్రాయం

- కేసీఆర్ కాంగ్రెస్‌ను విలన్ అనడం అర్థరహితం
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్తాన్‌తో తాడోపేడో తేల్చుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో కనిపిస్తోందని, అయితే యుద్ధం కంటే ఉగ్రవాదాన్ని సమూలంగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ భూభాగంలో ఉన్న ఉగ్రవాదులను వారి నాయకులను వెంటనే అప్పగించాలన్నారు. జనగణనలోనే కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల్లో సామాజిక నేపథ్యాల కారణంగా కులాల రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, ఈ అంతరాన్ని ఎలా తొలగిస్తారో చెప్పాలన్నారు. 2014 పునర్విభజన చట్టంలో నియోజకవర్గాల పునర్విభజన అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ తరువాత జమ్ముకాశ్మీర్‌లో చేశారన్నారు. విభజన చట్టం ప్రకారం అవకాశం ఉన్న తెలంగాణ, ఏపీలలో ఇప్పటి వరకు చేయలేదన్నారు. తెలుగు రాష్ట్రాలపై కేంద్రం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, చాలా సందర్భాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుందని, ఫొటో వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. టన్నెల్ ప్రమాదం వల్ల కొంత ఆలస్యమైనప్పటికీ త్వరలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని మాజీ సీఎం కేసీఆర్ అనడం అర్థరహితమన్నారు. తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు కేసీఆర్ స్వయంగా అనేకసార్లు తనతో చెప్పారని, సోనియా గాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని స్వయంగా కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ పోరాటాన్ని కూడా కాదనలేమని, అందుకే ప్రజలు పదేళ్ల అధికారం ఇచ్చారన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో కేసీఆర్, సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ పాత్ర కాదనలేమన్నారు.

ఎల్కతుర్తి సభ సక్సెస్‌తో కాంగ్రెస్ పార్టీలో వణుకు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో వణుకు పుట్టి అక్కసు వెళ్లగక్కుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పరిపాలనా అనుభవం లేని కొత్త బిచ్చగాళ్లను కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ ఏడాదిన్నర సమయం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెంది ప్రజల్లో కొత్త సమస్యలు సృష్టిస్తోందని విమర్శించారు. దేశ చరిత్రలో ఏ శాసనసభలో ఇలా వ్యవహరించలేదని, అసెంబ్లీలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సభలో నిబంధనలు గాలికి వదిలి బూతులు మాట్లాడిన చరిత కాంగ్రెస్‌దేనన్నారు. పదేళ్లలో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజల్లో చర్చకు పెడుదామని, దమ్ముంటే మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ముందుకు రావాలన్నారు. తెలంగాణను ఏడారి చేసి ఫ్లోరైడ్ మహమ్మారిని పెంచి పోషించి, సూర్యాపేటకు మూసీ నీళ్లు తాగించింది మీరు కాదా అని ప్రశ్నించారు. తమ హయాంలో 3.5లక్షల నుంచి 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని పెంచామని, ఆరు ఏళ్లలో ఫ్లోరైడ్ పీడను తొలగించామన్నారు. మూడు జిల్లాలను చేసి మూడు మెడికల్ కళాశాలలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్



దేవరకొండలోని ఓ ఆస్పత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

దేవరకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలని, అందుకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం దేవరకొండ పట్టణంలోని బాల విజయసాయి, జ్యోతి ఆస్పత్రి, వినాయకతో పాటు పలు డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను ఆయన తనిఖీలు చేశారు. ప్రతీ ఆస్పత్రిలో విధిగా ఫీజుల వివరాలు ప్రదర్శించాలన్నారు. ల్యాబ్‌లలో టెక్నీషియన్ సర్టిఫికెట్ కనిపించేలా ఉంచాలని సూచించారు. అనంతరం డాక్టర్ల అర్హత వివరాలు తెలుసుకొని, స్కానింగ్ సెంటర్లలో విధిగా రేడియాలజిస్టు ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ అరుంధతి, నర్సయ్య, హరిలాల్, విజయప్రసాద్, కలీం ఉన్నారు.

ముషంపల్లి రోడ్డుకు మహర్దశ

- రూ.100కోట్లతో కొనసాగుతున్న విస్తరణ పనులు
- మంత్రిగా కోమటిరెడ్డి తొలి సంతకం చేసిన పని
- నల్లగొండ-నాగార్జునసాగర్ నియోజకవర్గాలకు అనుసంధానమయ్యే రహదారి
- అత్యధికంగా 37 చోట్ల కల్వర్టుల నిర్మాణాలు
- నల్లగొండ-ముషంపల్లి-కన్నెకల్ మార్గంలో దారి పొడువునా విద్యుత్ లైన్ల షిఫ్టింగ్
- వీటివల్లే పనుల్లో జాప్యం
- మూడు కిలోమీటర్ల మేర పూర్తయిన బీటీరోడ్డు
- తొమ్మిది చోట్ల కాల్వలపై వంతెనలూ నిర్మించాల్సిందే



ఏఆర్‌నగర్ నుంచి గుట్టకింది అన్నారం వరకు పూర్తయిన డబుల్‌రోడ్

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ-ముషంపల్లి-ధర్మాపురం-కన్నెకల్ రోడ్డు విస్తరణ పనులు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో కొనసాగుతున్నాయి. ఈ రహదారిని 65 ఫీట్ల బీటీ రోడ్డుగా విస్తరిస్తున్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి నిమిషంలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ రహదారికి నిధులు మంజూరు చేస్తూ సంతకం చేయడంతో ఈ పనులకు ప్రాధాన్యం పెరిగింది.

ముషంపల్లి రహదారి ఎత్తు పెంచడంతో పాటు, పాత రోడ్డును మూడురెట్లు వెడల్పు చేస్తున్నారు. ఈ రహదారి పొడవునా సమాంతరంగా విద్యుత్ లైన్లు, సాగు నీటిపారుదలశాఖకు చెందిన వంతెనలు ఉండడంతో ఆయా శాఖల సమన్వయంతో ఈ రహదారిని విస్తరిస్తున్నారు. అదేవిధంగా రహదారికి ఇరువైపులా బత్తాయి తోటలు, వ్యవసాయ పొలాలు ఉండడంతో పెద్దసంఖ్యలో కల్వర్టులున్నాయి. వీటన్నింటినీ పునర్నిర్మించారు. నల్లగొండ పట్టణ శివార్లలో సుమారు కిలోమీటర్ మేర భూగర్భ మురుగునీటి కాల్వ నిర్మిస్తుండడంతో ఆ పనులు పూర్తయ్యాకే ఈ రహదారుల పనులు పూర్తిచేయాల్సి ఉంది. దీంతో యూజీడీ పనులను సైతం వేగవంతం చేశారు. మంత్రి తొలిసంతకం చేసిన పని కావడంతో, పనులను స్వయంగా మంత్రి పర్యవేక్షిస్తుండడంతో అధికారులు పనుల నాణ్యత, వేగంగా పూర్తిచేయడంపై దృష్టిసారించారు.

● నల్లగొండ-కన్నెకల్ మార్గంలో రోడ్డు విస్తరణలో తొమ్మిది చోట్ల కెనాల్ బ్రిడ్జీలున్నాయి. ఈ బ్రిడ్జీలను ఇరిగేషన్‌శాఖ పునర్నిర్మించాల్సి ఉండడంతో అక్కడ పాత బ్రిడ్జీలనే ప్రస్తుతానికి కొనసాగిస్తున్నారు. ఈ బ్రిడ్జీలు ఇరుకుగా ఉండడంతో పాటు కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ పెరుగుతుందని, దీంతో ఈ వంతెనలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జీలను సైతం రోడ్డు విస్తరణకు అనుగుణంగా నూతనంగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వీటిపై ఇంతవరకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయలేదని,

మిగతా 8వ పేజీలో...

● మూడు కిలోమీటర్ల మేర పూర్తయిన రహదారి

నల్లగొండ-కన్నెకల్ మధ్య బీటీ రోడ్డు ఎత్తు పెంపు, 65 ఫీట్ల వెడల్పుకు అనుగుణంగా అవసరమైన ఫార్మేషన్ పనులు పూర్తయ్యాయి. ఈ మొత్తం రహదారికి ఇరువైపులా బత్తాయితోటలు, వ్యవసాయ పొలాలు ఉండడంతో గతంలో అక్కడున్న జాలు కాల్వలు, వరదనీటి కాల్వలకు ఆటంకాలు లేకుండా ఏర్పాటైన 37 కల్వర్టులను పునర్నిర్మించారు. రోడ్డు పూర్తయ్యాక వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా రోడ్డుకు ఇరువైపులా ట్రెంచ్‌లను తవ్వే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రెండుచోట్ల చెరువుకట్టలు ఉండగా, అక్కడ విస్తరణ చేసేందుకు అవసరమైన ఫార్మేషన్ పనులు పూర్తిచేశారు. అన్ని పనులు పూర్తిచేసి ముషంపల్లి సమీపంలో రెండు కిలోమీటర్లు, గుంటుపల్లి వద్ద ఒక కిలోమీటర్‌మేర బీటీరోడ్డు నిర్మాణం పూర్తయింది. అదేవిధంగా మిగిలిన చోట్ల బీటీ వేసే పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

కూలీలకు అధిక వేతనం వచ్చేలా పనులు కల్పించాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ జి.సృజన



చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద నర్సరీని పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన

చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు అధిక వేతనం వచ్చేలా పనులను కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి శివారులో ఉపాధి హామీ పనులను, నర్సరీని కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. పనులకు ఏ సమయంలో వస్తున్నారు? ఎన్ని గంటలు చేస్తున్నారు? వేతనానికి తగిన పనిని కల్పిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన వేతనం వస్తోందని కూలీలు వివరించారు. ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతూ గుట్ట దగ్గర పనిని ఎలా గుర్తించారని, నిర్ధారించిన వేతనం రూ.307 ఎలా వస్తోందని అడిగారు. వాలు ప్రాంతాన్ని చేసుకుని కందకం పని చేయిస్తామని, వర్షం వస్తే నీరంతా దిగువకు జారి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నీరు ఇంకేలా పనులు చేయిస్తున్నామన్నారు. కొలతల ప్రకారం రోజుకు కూలి రూ.307 వస్తోందని వివరించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల లక్ష్యం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూలీలు పనులకు త్వరగా వస్తే ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.307 వస్తుందన్నారు. గుట్ట ప్రాంతాల్లో వేసవితో జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలన్నారు. ఇళ్లల్లో పెంచుకునేలా పెరటి మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీవో వెంకటయ్య, పీఆర్ ఈఈ గిరిధర్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో జయలక్ష్మి, ఏపీవో శ్రీలత, తదితరులు ఉన్నారు. కాగా, కుడిచేతి నొప్పి కారణంగా కట్టుతోనే కలెక్టర్ త్రిపాఠి హాజరయ్యారు.

అదేవిధంగా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల, యడవెల్లి, నార్కట్‌పల్లి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్, ఫాంపాండ్ పంచాయతీరాజ్ కమిషనర్ సృజన పరిశీలించారు. ఆమె వెంట జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవో ఉమేష్, ఎంపీవో సుధాకర్, ఏపీవో యాదయ్య, తదితరులు ఉన్నారు.

ధాన్యం దిగుమతుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



మిర్యాలగూడలో అధికారులను వివరాలు అడిగితెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తక్షణమే దిగుమతి చేసుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని అవంతీపురం మార్కెట్‌యార్డులోని ఐకేపీ కేంద్రంతోపాటు సూర్యతేజ రైస్‌మిల్లు, పలు రైస్ మిల్లులను ఆమె తనిఖీచేసి మాట్లాడారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, సివిల్ సప్లయ్స్ అధికారులు, మార్కెట్ సూపర్‌వైజర్ అరుణ్, సీఈవోలు లచ్చయ్య, యాదగిరి ఉన్నారు.

తాలు పేరుతో కోత పెడుతున్నారు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్): తాలు పేరుతో మిల్లర్లు ధాన్యంలో కోత పెడుతున్నారని రైతులు కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీచేశారు. నాణ్యత ఉన్నవి, నాణ్యత లేనివి చూడకుండా అన్నింటికీ ఒకేలా కోత పెడతామంటున్నారని, అలాగైతేనే దిగుమతి చేసుకుంటామంటున్నారని రైతు నర్సిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ధాన్యం ఎగుమతికి లారీలు సరిగా రావడం లేదని పీఏసీఎస్ చైర్మన్ రేగట్టె నారాయణరెడ్డితో పాటు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీఎస్‌వో హరీష్, డీసీవో పాత్యానాయక్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, కేంద్రం పర్యవేక్షణాధికారి రేణుక, డీటీ రామకృష్ణ, ఆర్ఐ తరుణ్, ఏఈవో విజయలక్ష్మి, పీఏసీఎస్ సీఈవో చిక్కుళ్ల వెంకన్న, తదితరులు ఉన్నారు. అదేవిధంగా చిట్యాల మండలం వట్టిమర్తిలోని ఉదయ్ ఇండస్ట్రీస్ కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలన్నారు. దిగుమతుల్లో జాప్యం లేకుండా హమాలీల సంఖ్య పెంచాలని సూచించారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు పటిష్ట భద్రత

● ఐజీ సత్యనారాయణ ● నాగార్జునసాగర్‌లో ఏర్పాట్ల పరిశీలన



సాగర్ బుద్ధవనంలో ఏర్పాట్లపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో చర్చిస్తున్న ఐజీ సత్యనారాయణ

● 7లో..

విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు



ఏరియా ఆస్పత్రిలో వైద్యుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి అవుట్ పేషంట్ వార్డుల్లో రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రోగులు మాట్లాడుతూ వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావడం లేదని, గంటల తరబడి ఆస్పత్రి విభాగాల వద్ద వేచిచూడాల్సి వస్తోందని రోగులు వాపోయారు. అనంతరం ఇన్‌పేషంట్ వార్డును తనిఖీ చేసి అవుట్ పేషంట్, ఇన్‌పేషంట్ వార్డుల్లో రోగుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాల్లో విధుల్లో ఉండాల్సిన వైద్యుల గురించి ఆరాతీయగా పలువురు గైర్హాజరు అవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 11గంటల వరకు ఓపీ వార్డుకు రాని వైద్యుల వివరాలపై ఆరా తీశారు. ఓపీ, ఐపీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయా వార్డుల్లో వైద్యసేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. చికిత్స విషయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రోగులు ఆవేద వ్యక్తం చేశారు. దీంతో వైద్యుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సర్జన్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో గుర్తించిన లోపాలు, వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం

హాలియా,మే 1(ఆంధ్రజ్యోతి): హాలియా జడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ శిక్షణ శిబిరాన్ని అనుముల ఎంఈవో గుండా కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జూన్ 6 వరకు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీడీ వెంకట్‌రాంరెడ్డి, కోచ్ ఎల్లయ్య, గౌని రాజారమేష్‌యాదవ్, సోమవేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

ఖజాఆరీపుద్దీన్‌కు పదోన్నతి

దేవరకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్.నాగరాజుకు కమిషనర్‌గా, అలాగే దేవరకొండ మునిసిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఖజాఆరీపుద్దీన్‌కు మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ సీడీఎంఏ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వారు ఈ నెల 4వ తేదీలోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : ఆర్డీవో



డిండిలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

డిండి, మే 1(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. బుధవారం కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు, లారీల సంఖ్యను పెంచి ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యాన్ని ఎగుమతి చేయాలని ఆయన కోరారు. రైతులు ఆరబోసిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, సీవో బాల్‌రెడ్డి, అంతిరెడ్డి ఉన్నారు.

కార్యాచరణ సరే.. అమలేదీ ?

- మిర్యాలగూడ పట్టణంలో ఎక్కడి చెత్తక్కడే..
- పారిశుధ్యంపై కరువైనపర్యవేక్షణ
- ఎమ్మెల్యే ఆదేశించినా. అమలు చేయని అధికారులు

> పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి.. అందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి. రెండు నెల ల పాటు మాకిదే పని.. రోజు విడిచి రోజు సమావేశం నిర్వహిస్తాం. అధికారులు, ఉద్యోగులందరూ హాజరుకావాలి. ముఖ్యంగా వార్డు అధికారులు పట్టణంలో పర్యటించి సమస్యలు గుర్తించాలి. అవి పేపరుపై నమోదు చేసి మాకందించాలి
>
> \- ఏప్రిల్ 17, మునిసిపల్ సమావేశంలో
> ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో పేరుకుపోయిన చెత్త

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మునిసిపల్ సమావేశంలో అధికారులను ఆదేశించారు. అయితే సమావేశం జరిగి పక్షం రోజులవుతున్నా అందుకనుగుణంగా చర్యలేమీ కనిపించడం లేదు. పట్టణ పరిశుభ్రతకు రెండు నెలల కార్యాచరణ ప్రకటించినా పాలకులు ఆ దిశగా చర్యలేమీ తీసుకోవడం లేదు. ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్, రైతు బజారు, ప్రధాన కూడళ్లలో చెత్తకుప్పలు ఉండకుండా చూడాలని, డ్రైనేజీ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించినా పాత మురిపంగానే ఉందనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ ఆదేశించిన వీధిదీపాలు, తాగునీరు, దోమల నివారణకు ఇప్పటి వరకూ తీసుకున్న ప్రత్యేక చర్యలేమీ లేవు. ప్రత్యేక సమావేశాలు, సమీక్షలు నిర్వహించిన తరుణంలో హడావుడి చేసే అధికారులు తదనంతరం కిమ్మనకుండా కూర్చుంటున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తారు.

తీసుకున్న నిర్ణయాలివి..

మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. అరవై రోజులు, ముప్పై సమావేశాలతో రెండు నెలల కార్యాచరణ ప్రకటించారు. అందులో పట్టణంలో ఎక్కడా చెత్త కనిపించొద్దని, ప్రధాన నాలాలలో వ్యర్థాలు తొలగించి, పూడిక తీయాలని నిర్ణయించారు. ఇక పట్టణంలోని రహదారులు, ప్రభుత్వ స్థలాలు, క్రీడామైదానాలను ఆక్రమించి వ్యాపారాలు సాగించే వారిని నివారించాలనుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న బడ్డీకొట్లు, తోపుడు బండ్లను ఎప్పటికపుడు తొలగిస్తామన్నారు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, ఉద్యోగులపై చర్యలుంటాయని ప్రకటించారు.

బిజీబిజీగా వార్డు ఆఫీసర్లు..

మునిసిపల్ శాఖలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వార్డు ఆఫీసర్లకు పలు బాధ్యతలు అప్పగిస్తున్నారు. అందులో భాగంగానే పట్టణ పరిశుభ్రతపై వార్డుల వారీగా కాగితాలపై నివేదికలు కోరారు. ఎమ్మెల్యే. అయితే సదరు ఆఫీసర్లకు మునిసిపల్ అధికారులు మరికొన్ని బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఉదాహరణకు ఆస్తి, నల్లా పన్ను వసూలు, ఎల్ఆర్ఎస్‌పై అవగాహన, ఆహార భద్రత కార్డుల దరఖాస్తుదారుల సర్వే తదితర పనులతో నిత్య బిజీగా ఉండే వార్డు ఆఫీసర్లు పట్టణ పరిశుభ్రతపై దృష్టి సారించలేకపోతుండగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన మునిసిపల్ పారిశుధ్య విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది



పరిశుభ్రత, పట్టణాభివృద్ధి నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ ఆదేశానుసారం మా వార్డు ఆఫీసర్లు పట్టణంలో పర్యటించి పలు సమస్యలను గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు. రెండు నెలల పాటు ప్రత్యేక కార్యాచరణ కచ్చితంగా అమలు చేస్తాం. ప్రజల సహకారంతో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

\- మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

ప్రైవేటును మించి 'పది' ఫలితాలు

● ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ● ఫలించిన ఉపాధ్యాయుల కృషి

(ఆంధ్రజ్యోతి- నిడమనూరు): పదోతరగతి ఫలితాల్లో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు నాణ్యమైన బోధన అందించడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మండలంలో ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలలు, మూడు గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. మండలంలో 464 మంది పరీక్ష హాజరు కాగా 456 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడు గురుకులాలతో పాటు నిడమనూరు, తుమ్మడం, ముకుందాపురం, నారమ్మగూడెం, రాజన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. గుగులోతు గణేష్, ఆవుల వర్షిత, సాయికిరణ్, పూజిత, గీతిక, సాత్విక, హర్షిత, సాయి, రఘువీర్, కీర్తి విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు ఉదయం, సాయంత్రం, సెలవుల్లో విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు రావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించాం. ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో పని చేసి నాణ్యమైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందనడానికి టెన్త్ ఫలితాలే నిదర్శనం.

\- లావూరి వెంకన్న, ఎంఈవో, నిడమనూరు

'చందంపేట ' పలు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

చందంపేట, మే 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల, తెల్‌దేవరపల్లి ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. తెల్‌దేవరపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి 600 మార్కు లకు 523 సాధించి మండల స్థాయిలో ప్రతిభ చూపాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంఈవో చందర్‌నాయక్ అభినందనలు తెలిపారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి : సీఐటీయూ



హాలియాలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

హాలియా,మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. హాలియాలో గురువారం నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొని పట్టణం లో బైక్ ర్యాలీ నిర్వహించి వివిధ సెంటర్లలో జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ శ్రమ దోపిడీ చేస్తూ కార్పొ రేట్ సంస్థలకు దోచిపెడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, నాయకులు ఎస్‌కే సైదుషియన్, యాదయ్య, కాట్నం వెంకటయ్య, ఏసోబు, కారంపూడి ధనమ్మ, వెంకన్న, ఆకారపు నరేష్, శంకర్, వెంకన్న, లింగయ్య, జానీ, ఖాసీం వెంకటయ్య పాల్గొన్నారు.

అన్నదానం

మేడే ఉత్సవాల్లో భాగంగా ఎన్‌సీఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ నల్లగొండ ఆంజనేయులు కార్మిక వర్గానికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అవుతా సైదులు, కేసాని యాదయ్య, షేక్ సయ్యద్, హుస్సేన్, కాట్నం వెంకటయ్య, నల్లగొండ వేణు, కార్మికులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్ PUBLIC DEMAND



వృథాగా ప్రయాణికుల ప్రాంగణం

కొండమల్లేపల్లి మండలంలోని చెన్నంనేనిపల్లి గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద ప్రయాణికుల ప్రాంగణం వృథాగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికుల ప్రాంగణం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. వేసవి కావడంతో బస్సులు, ఆటోలలో ప్రయాణించే ప్రయాణికులు కొంత సేపు సేద తీరడానికి బస్టాండు ప్రాగణంలోకి వెళ్లాలంటే కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరుగడంతో వెళలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల ప్రాంగణాన్ని విని యోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి- కొండమల్లేపల్లి)

కదం తొక్కిన కార్మిక లోకం

● వాడవాడలా మేడే వేడుకలు ●జెండాలను ఎగురవేసి ర్యాలీ నిర్వహించిన పలు పార్టీలు, సంఘాలు ● పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాడవాడలో పండుగ వాతావరణంలో జెండాలను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: మేడే సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం ఆధ్వర్యంలో హనుమాన్‌పేట నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. దేశంలో 80శాతం మంది ప్రజలు పేదరికంతో అల్లాడిపోతున్నారని, పేద కష్టాలు తీర్చాల్సిన పాలకులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహిస్తున్నారని అన్నారు. కార్మికుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కొత్తచట్టాలతో కాలరాసే ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతమ్‌రెడ్డి, బావండ్ల పాండు, పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : టీడీపీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి మిర్యాలగూడ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట మే డే జెండాను ఆ పార్టీ జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముక్కెర అంజిబాబుయాదవ్,నసీరుద్దీన్‌బాబా, చిలకల వెంకన్న, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● దామరచర్ల : మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పాపానాయక్, దయానంద్, కోటిరెడ్డి, ఎర్రనాయక్ పాల్గొన్నారు. అలాగే సీపీఐ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధీరావత్ శాంతా, పోలెపల్లి ఉదయ్‌కుమార్, జమ్ముల కోటయ్య, పేరుపొంగు లక్ష్మయ్య, సుద్దబోయిన రాములు, వెంకన్న, విజయ్, వినయ్ పాల్గొన్నారు.

● దేవరకొండ : దేవరకొండలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ జెండాను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఎగురవేసి మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ పోరాడుతుందన్నారు. మేడే వేడుకలను దేవరకొండలో సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ కార్యాలయం లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహరెడ్డి, సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఎన్‌వీటీ, ఆర్టీసీ డిపోలో జరిగిన మేడే వేడుకలలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొని జెండాను ఆవిష్కరించారు.



పీఏపల్లి : రంగారెడ్డిగూడెం వాటర్ ప్లాంట్ వద్ద జెండావిష్కరణ లో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్,కార్మిక సంఘ నాయకులు

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఐఎన్‌టీయూసీ 327 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్మికులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జ మునామాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఆటో, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాలను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయిని మాధవరెడ్డి, వేమన్‌రెడ్డి, ఆదిరాల శ్రీను పాల్గొన్నారు.

● హాలియా : మండలకేంద్రంలో ఐన్‌టీయూసీ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అన్వరుద్దీన్ ఆధ్వర్యంలో మే డేను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుముల మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి,నెర్మటి వెంకట్‌రెడ్డి, జూపల్లి శ్రీనివాస్, పాంపాటి శ్రీనివాస్, ముత్యాలు, మజహర్, నసీరుద్దీన్, యడవల్లి సోమశేఖర్ పాల్గొన్నారు. హాలియా మున్సిపాలిటీ ఇబ్రహీంపేట వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కేవీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు నాదెండ్ల సోమయ్య, నాదెండ్ల కొండలు, చినాల రవి, నాదెండ్ల ఆంజనేయులు, కట్టా కృష్ణ, పాల్గొన్నారు.

● చందంపేట : చందంపేట, ముడుదండ్ల, గన్నేర్లపల్లి, చిత్రియాల గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో, నేరేడుగొమ్ము మండలం నేరేడుగొమ్ము, పెద్దమునిగల్, కాచరాజుపల్లి గ్రామాలలో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ కార్మికసంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ చందంపేట మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, నేరేడుగొమ్ము మండల కార్యదర్శి బొమ్ము అచ్చయ్య పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : వివిధ కార్మిక సంఘాల ఎర్ర జెండాను ఎగురవేసి సహపంక్తి భోజనాలు చేశారు .కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బషీర్ , నాయకులు గుజ్జుల ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, గోవిందు, రోశయ్య, నాగార్జున, అంజి, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

● నిడమనూరు : మండలంలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మహిళల కోలాటం ప్రదర్శన నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాడవాడలా కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను కత్తి లింగారెడ్డి, కందుకూరి కోటేష్, కొమాండ్ల గుర్వయ్య, నల్లబోతు సోమయ్య, మల్లికంటి చంద్రశేఖర్, కుంచం శేఖర్ పాల్గొన్నారు.

● వేములపల్లి : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సీపీఐ, సీపీఎం పార్టీల, అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి జిల్లా యాదగిరిలు మద్దిరాల వెంకట్‌రెడ్డి, మున్నయ్య, జడ భీమయ్య, వస్క పరమేష్, పుట్టల కృష్ణయ్య, భిక్షం, లచ్చయ్య, ఆనందం, రాజు పాల్గొన్నారు.



మిర్యాలగూడ మేడే వేడుకల్లో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, పక్కన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, తదితరులు


● మాడ్గులపల్లి : మండల కేంద్రంలో సీపీఎం జెండాను రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, నగిరె కృష్ణయ్య, జూకూరి నాగయ్య, గడగోజు వెంకటాచారి, కన్నయ్య, కట్టా సతీష్‌రెడ్డి, రాములు, లింగస్వామి, మాధవ్, వెంకన్న పాల్గొన్నారు.

● డిండి : సీపీఐ, అనుబంధ సంస్థల ఆధ్వర్యంల ఎర్రజెండాలను ఎగురవేసి మేడే ఉత్సవాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి వెంకటరమణ, తూంబుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, ఎండి.ఖైరొద్దిన్, నూనె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(గొడుకొండ్ల)లో కార్మికులు జెండాను ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లం పాండురంగారావు ఎగురవేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పూరె లక్ష్మణ్, పుల్లెంల నరసింహ, పాలకూర్ల భాస్కర్, అంజయ్య, నరసింహ, శేఖర్, శివ, పోలేపల్లి నరేష్,పాల్గొన్నారు.

● గుర్రంపోడు మండల కేంద్రం , కొప్పోల్ గ్రామంలో ఏఐటీయూసీ జెండాను సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు లక్ష్మీపతి, అధ్యక్షులు నరసింహ, కార్యదర్శి ఎస్‌కె. అమీర్, జాల పెద నరసింహ, శ్రీనుచారి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి, : మండలంలోని రంగారెడ్డిగూడెం వద్ద మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద హమాలీ, ఆటో, పెయింటర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అలాగే అజ్మాపురంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ జెండా ఆవిష్కరించారు కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యోట్లురి వల్లపురెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, సైదిరెడ్డి, బాలకృష్ణ ఉన్నారు.



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డికి సన్మానం



జేడీఏ శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏపీఎం చంద్రశేఖర్, తదితరులు

మాడ్గులపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ పీడీ వై.శేఖర్‌రెడ్డి వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. దీంతో సెర్ప్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, మాడ్గులపల్లి ఏపీఎం బాషపాక చంద్రశేఖర్ గురువారం నల్లగొండలో శేఖర్‌రెడ్డిని కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వి.యాదయ్య, జీన రహరి, బి.శ్రీనివాస్, జీడికళ్ల శ్రీదేవి, జానకి, శ్రీనివాస్, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

పెద్దఅడిశర్లపల్లి, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్యాల ఆదర్శ పాఠశాలకు చెందిన పున్న మణిదీప్ పదో తరగతి ఫలితాల్లో 559 మార్కులు సాధించి ప్రతిభ చూపారు. దీంతో మణిదీప్‌ను నల్లగొండ డీఈవో భిక్షపతి, సిబ్బందిని అభినందించారు. మోడల్ స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉతీర్ణత సాధించారని ప్రిన్సిపల్ నకిరేకంటి శ్రీనయ్య తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముషంపల్లి రోడ్డుకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

తక్షణమే వీటి పునర్నిర్మాణంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

వేగవంతంగా పనులు పూర్తిచేయాలి

ముషంపల్లి రహదారి పనులు ప్రారంభించి 15 నెలలు గడిచింది. విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పిడి, కల్వర్టుల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. అయితే మంత్రి సంతకం చేసిన తొలి పని కావడంతో దీన్ని జాప్యం లేకుండా పనులు కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. నల్లగొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతో జిల్లా కేంద్రానికి అనుసంధానమయ్యే ఈ రోడ్డు ఎంతగానో ప్రయోజకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్న స్థానికులు రోడ్డు పనులు మందగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో పనుల్లో వేగం తగ్గిందని, తక్షణమే పనులు వేగం పుంజుకునేలా మంత్రి చర్యలు తీసుకోవాలని స్థానికులు చెబుతున్నారు. బీటీ వేసే పనే ప్రస్తుతం మిగిలి ఉందని, వేసవి ముగిసేలోగా ఈ పని పూర్తిచేయించాలని కోరుతున్నారు. అదేవిధంగా కాల్వల వంతెనలను కూడా పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ పనులు కూడా చేపట్టాలని కోరుతున్నారు.

పనులు వేగంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటాం

ముషంపల్లి రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దాదాపు మూడు కిలోమీటర్ల మేర బీటీ పూర్తయింది. రోడ్డు విస్తరణ కావడంతో కల్వర్టులు, విద్యుత్ లైన్ షిఫ్టింగ్, మట్టిరోడ్డు నిర్మాణం ముందస్తుగా చేపట్టాం. ఆ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. బీటీ పనుల్లో కూడా వేగం పెంచుతాం. కాల్వలపై ఉన్న బ్రిడ్జీలను ఇరిగేషన్‌శాఖనే పునర్నిర్మించాల్సి ఉంది. అది ఆర్అండ్‌బీ పరిధిలోకి రాదు. వీలైనంత వేగంగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

యాకుబ్, ఆర్అండ్‌బీ డీఈ, నల్లగొండ